ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 24 ఫిబ్రవరి 2024 | 5





దళితులు, పోలీసుల మధ్య వాగ్వాదం

కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి నిరసన సెగ

గోపాలపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఆయన తండ్రి పేరు పెట్టడంపై దళితుల ఆగ్రహం

కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి స్వగ్రామంలో దళితుల నుంచి నిరసన సెగ తగిలింది. శుక్రవారం ఆయన గోపాలపురం సిద్ధార్థ నగర్ వద్ద అవంతి ఫ్యాక్టరీ యజమాన్యం సమకూర్చిన నిధులతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల ప్రారంభించారు. అయితే దానికి జగ్గిరెడ్డి తండ్రి పేరు సోమసుందరరెడ్డి పేరు పెట్టడాన్ని ఆ ప్రాంత దళితులు వ్యతిరేకించారు. జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గతంలో అన్నపూర్ణ హోటల్‌లో అంబేడ్కర్ బొమ్మతో ఉన్న ప్లేట్ల వివాదంలో అమాయకులైన దళితులను జైలుకు పంపి ఇప్పుడు ఇక్కడికి ఎలా వచ్చారంటూ మహిళలు నిలదీశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయడం ఏమిటంటూ ప్రశ్నించారు. అంబేడ్కర్‌కు జగ్గిరెడ్డి వేసిన పూలదండలను తీసివేసి పాలభిషేకం చేశారు.... వివరాలు 6లో



దళితుల ఆగ్రహానికి కారణమైన పాఠశాల భవనం (పైన) ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి (కింద)





కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

రేపు గ్రూప్-2 రాత పరీక్షలు

- జిల్లాలో 10,788 మంది అభ్యర్థులకు 33 కేంద్రాలు
- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు వెల్లడి

అమలాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 రాత పరీక్షలను ఆదివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో శుక్రవారం ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాత పరీక్షల సన్నద్ధతపై రూట్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో 10,788 మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరి కోసం జిల్లాలో 33 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసి 475 గదుల్లో పరీక్షలు రాసేందుకు ఎంపిక చేశామన్నారు. రాత పరీక్ష నిర్వహణకు 11 రూట్లుగా విభజించామన్నారు. ప్రతి కళాశాల ప్రిన్సిపల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా అదే కళాశాలలో వ్యవహరిస్తారన్నారు. 528 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుంది. 33 మంది లైజన్ అధికారులను నియమించామన్నారు. ప్రశ్నపత్రాల తరలింపు, భద్రతతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతలను పర్యవేక్షించే బాధ్యతను పోలీసులు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌కో అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని, కేంద్రాల చుట్టుపక్కల జిరాక్సు కేంద్రాలను మూసివేయించాలన్నారు. ప్రశ్నపత్రాలను రూట్ అధికారులు భద్రత నడుమ సంబంధిత కేంద్రాలకు తరలించాలన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు శంకరరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బర్లంక బ్యారేజీపై తారు పొర తొలగించి వదిలివేసిన దృశ్యం

- కాటన్ బ్యారేజీ మరమ్మతుల పనుల తీరిదీ
- రూ.30 లక్షలు మంజూరు చేయని కలెక్టర్
- నిధులు లేక కోనసీమ పరిధిలో వదిలివేసిన వైనం

అక్కడ పూర్తి... ఇక్కడ అసంపూర్తి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 23: ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీపై కొద్ది రోజుల క్రితం చేపట్టిన మరమ్మతులు చిత్రవిచిత్రంగా ముగిసాయి. సగం పనులను పూర్తి చేయగా మధ్యలో పనులను నిధులు లేక వదిలేశారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ బ్యారేజీ రోడ్డు తరచుగా పాడైపోవడంతో ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఏడాది క్రితం జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ పార్టీ నిధులతో బ్యారేజీపై రహదారి నిర్మిస్తామని ప్రకటించగా అధికార యంత్రాంగం అడ్డుతగిలింది. మేమే పనులు చేస్తామని హామీ ఇచ్చి గోతులు పూడ్చి చేతులు దులుపుకుంది. దీంతో కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ ఆయా పార్టీల శ్రేణులతో కలిసి బ్యారేజీపై ఆందోళన చేశారు. దీంతో మరమ్మతులు చేస్తామంటూ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి భారీ ఫ్లెక్సీ పెట్టి పనులకు శ్రీకారం చుట్టారు. అయితే తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పనులకు మంత్రి తానేటి వనిత కలెక్టర్ ద్వారా రూ.2 కోట్లు మంజూరు చేయించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి బ్యారేజీపై రాకపోకలు నిలిపివేసి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఆరు కిలోమీటర్ల మేర విజ్జేశ్వరం, ధవళేశ్వరం ఆర్మ్‌ల వద్ద తారు రోడ్డు, ఇతర కాంక్రీట్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేశారు. బ్యారే జీ మధ్య భాగం ర్యాలి ఆర్మ్ సుమారు కిలోమీటరు మేర నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఇందుకు రూ.30 లక్షలను కోనసీమ జిల్లా కలెక్టర్ మంజూరు చేయాల్సి ఉంది. అయితే నిధుల విడుదలలో అలసత్వం కారణంగా పనులు నిలిచిపోయాయి. ఈ నెల 16న బ్యారేజీపై రాకపోకలకు అనుమతి ఇచ్చారు. ర్యాలి ఆర్మ్ పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ గోతులు అక్కడే ఉన్నాయి. అధికార పార్టీ నేతల తీరుపై ప్రజలు, ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు. మిగిలిన సగం పనులు ఎప్పుడు చేస్తారో, ప్రజలు వాహనచోదకుల కష్టాలు ఎప్పుడు తీరుస్తారో తెలియని పరిస్థితి.





బ్యారేజీపై దర్శనమిస్తున్న గోతులు

వెలిచేరు నుంచి బొబ్బర్లంక వరకు ఆర్అండ్‌బీ రహదారి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర అధ్వానంగా వుంది. ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాడపల్లి వెంకన్న ఆలయానికి రాత్రి వేళల్లో వెళ్లే బాటచారులు గోతుల్లో పడి గాయలపాలవుతున్నారు.









పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

ఆగని మట్టి మాఫియా ఆగడాలు

- రాత్రివేళ ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- మట్టి తరలిస్తున్న ఆరు వాహనాలు సీజ్

ఆలమూరు, ఫిబ్రవరి 23: మట్టి మాఫియా ఎక్కడా తగ్గట్లేదు. లంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను కొనసాగిస్తూనే వుంది. రాత్రివేళల్లో ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వించి ట్రాక్టర్లు, లారీల్లో ఇటుక బట్టీలు, నర్సరీలకు తరలిస్తోంది. ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం, చొప్పెల్ల లంక భూముల లంక భూముల్లో మట్టి తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ నేతృత్వంలో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. రెండు లారీలు, నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటికి ఏ విధమైన మైనింగ్ బిల్లులు లేకపోవడంతో తదుపరి చర్యలు తీసుకోవాలని తహసీల్దారు కె.గోపాలకృష్ణకు ఎస్ఐ శ్రీనునాయక్ సిఫార్సు చేశారు. కాగా వాహనాల విడుదలకు మట్టి మాఫియా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సీజ్ చేసిన వాహనాలను రావులపాలెం సీఐ ఎం.రామ్ కుమార్ పరిశీలించారు.



టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావుదొర

అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు వేయించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దుర్గారావుదొర

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: చిన్నారుల్లో అంగవైకల్యం రాకుండా తప్పనిసరిగా రెండు పల్స్‌పోలియో చుక్కల మందు వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పల్స్‌పోలియో నిర్వహణపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని డీఎంహెచ్‌వో అధ్యక్షతన లైన్ డిపార్టుమెంట్ అధికారులతో నిర్వహించారు. మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణ తీరును ఆయన వివరించారు. దేశంలో పల్స్‌పోలియో కేసులు నమోదు కానప్పటికీసరిహద్దు దేశాల్లో కేసులు నమోదవుతున్న దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పల్స్‌పోలియో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 1,45,318 మంది ఉన్నారని, వీరి కోసం మార్చి 3న బూత్ స్థాయిలో 1850 బృందాలతో 983 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేసేలా 52 మొబైల్ టీములు ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకార ఆవాసాలు, మురికివాడల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బీవీ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీలక్ష్మి, డీఈవో ఎం.కమలకుమారి, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి జ్యోతిలక్ష్మీదేవి, డాక్టర్ సుమలత, కో-ఆర్డినేటర్ జాన్‌లెవీ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

29లోగా వ్యాపార సంస్థల రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: వ్యాపార సంస్థలకు సంబంధించి రిజిస్ట్రేషన్లను ఈ నెల 29వ తేదీలోగా రెన్యువల్ చేయించాలని కార్మిక శాఖ సహాయ కమిషనరు టి.నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని వివిధ దుకాణాలు, వాణిజ్య, వ్యాపార, భవన, ఇతర నిర్మాణ సంస్థలు, ఒప్పంద కార్మికులు, అంతర్ రాష్ట్ర వలస కార్మికులను వినియోగించే సంస్థలు కార్మిక చట్టాల కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇప్పటికే నమోదైన సంస్థలు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం-2015కింద దుకాణాలు, సంస్థలు ఒకే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, లైసెన్సు పొందే వెసులుబాటు ఉందన్నారు. సింగిల్ విండో విధానంలో రిజిస్ట్రేషన్లు, రెన్యువల్‌ను మీ-సేవా కేంద్రాలతో పాటు సచివాలయాల్లో నిర్వహిస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని నాగలక్ష్మి హెచ్చరించారు.

లెక్క తేలిందిగా... ఇక స్థలాలు అప్పగించండి

- విలసవిల్లిలో 30 ఎకరాల ప్రభుత్వ భూమి
- గ్రామంలోనే ఇళ్ల స్థలాలివ్వాలని అభ్యర్థన
- ప్రభుత్వ భూమిని పట్టించుకోని అధికారులు
- ఇతర గ్రామాల్లో స్థలాల మంజూరు
- రీ సర్వేలో లెక్కతేలిన ప్రభుత్వ భూమి
- ఇప్పుడైనా స్థలాలు కేటాయించాలని సర్పంచ్ వినతి

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 23: ఉప్పలగుప్తం మండలం విలసవిల్లిలో 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇది పలువురి ఆక్రమణలో ఉంది. ఈ అంశాన్ని గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు చాలాకాలంగా అధికారులకు వివరిస్తూనే ఉన్నాడు. అయినా ఎవరూ దృష్టి సారించలేదు. సర్పంచ్ అభ్యర్థన మేరకు రెవెన్యూ సర్వే చేశారు. ప్రభుత్వ భూమిని గుర్తించారు. గ్రామంలో 99 మందిని ఇళ్ల స్థలాలకు అర్హులుగా గుర్తించారు. ప్రభుత్వ భూమిని విస్మరించి గ్రామంలో భూమి కొనేందుకు ప్రయత్నిస్తే ఎకరం కోటి రూపాయలకు తక్కువ లేదని తేలింది. దీంతో మరో గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలిచ్చారు. లబ్ధిదారులు మాత్రం ఆ గ్రామం వెళ్లేందుకు సుముఖత చూపలేదు. పట్టాలు రిజిస్ట్రేషన్లు చేయించుకోలేదు. కాగా గ్రామంలో జరిగిన రీ సర్వేలో ప్రభుత్వ భూమి కావలసినంత ఉన్నట్టు లెక్కలు బహిర్గతమయ్యాయి. ఆ ప్రాంతాల్లో తమకు పట్టాలివ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ భూమిలో సర్వే రాళ్లు పాతి హద్దులు నిర్ణయించారు. తక్షణం ఈ ప్రాంతాల్లో స్థలాలు కేటాయిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని లబ్ధిదారులు చెప్తున్నారు. ప్రభుత్వ భూమిలో పేదలకు స్థలాలు ఇవ్వాలని వైసీపీకి చెందిన సర్పంచ్ సలాది ఊర్మిళాదేవిసతీష్ కోరుతున్నారు. దీనివల్ల లబ్ధిదారులకు సొంత గ్రామంలోనే తలదాచుకునేందుకు చోటు దొరికిందన్న ఆనందంతో పాటు ప్రభుత్వానికి భూమి కొనుగోలు సొమ్ము ఆదా అవుతుందని ఆమె అభిప్రాయపడుతున్నారు. లెక్కతేలింది. కావలసినంత స్థలం ఉంది. ఇక ఉన్నతాధికారులు వేగంగా స్పందిస్తే పేదలకు న్యాయం జరుగుతుందని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు.



విలసవిల్లి బీరవారిపేటలో గుర్తించిన ప్రభుత్వ భూమి

ప్రభుత్వ భూమిలో ఇళ్ల పట్టాలివ్వండి

కొండా పద్మ, విలసవిల్లి



గ్రామంలో ప్రభుత్వ భూమి ఉందని అధికారులే లెక్క తేల్చారు. ఇళ్ల నిర్మాణానికి ఆ భూమి ఎంతో అనువుగా ఉంటుంది. ఆ భూమిలో మాకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

వేరేచోట స్థలాలెందుకు



బీర బాలకృష్ణ, విలసవిల్లి

మా గ్రామంలోనే ప్రభుత్వ భూమి ఉండగా ఇతర గ్రామాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. గ్రామంలో అవసరమైన భూమి ఉందని సర్పంచ్ సహా పలువురు నాయకులు పదే పదే చెప్తున్నా అధికారులు పెడచెవిన పెట్టారు. చివరకుసర్వేలో వాస్తవాలు తేలాయి. ఇక ఆలస్యమెందుకు? ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

పేదలకు న్యాయం చేయండి



సలాది ఊర్మిళాదేవి, సర్పంచ్, విలసవిల్లి

మా గ్రామంలో సమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. పేదలకు న్యాయం జరగాలన్న ధ్యేయంతో చాలా కాలంగా నా భర్త సతీష్, మరికొందరు ప్రభుత్వ భూమిని సర్వే చేసి విడదీయాలని అధికారులను కోరుతూ వచ్చారు. ఫలితంగా రెవెన్యూ సర్వేలో భూమిని గుర్తించారు. అయినా అధికారులు ఆ భూమిని కాదని వేరే గ్రామంలో 99మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. మా అభ్యర్థన మేరకు కలెక్టర్ డ్రోన్ సర్వేకు ఆదేశించడంతో ప్రభుత్వ భూమి లెక్కలు నిగ్గు తేలాయి. అభ్యంతరాలు తొలగిపోయాయి. ప్రభుత్వ భూమిలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నాను. ఈ విషయంలో గ్రామంలో అందరి సహకారం పూర్తిగా ఉంటుంది.



గడియార స్తంభం సెంటర్లో నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల ప్రతినిధులు

రైతులపై కాల్పులు అమానుషం

గడియార స్తంభం సెంటర్లో నిరసన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రైతు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని డిమాండు చేస్తూ ఢిల్లీలో ఆందోళనకు దిగిన రైతులపై కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గడియార స్తంభం సెంటర్లో నిరసన తెలిపారు. పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన యువ రైతు శుభకిరణ్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేఎస్ బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నిమ్మకాయల శ్రీనివాసరావు, రైతు, కార్మిక సంఘాల నాయకులు కామిశెట్టి నాగబాబు, మోకా శ్రీనివాసరావు, కాళ్ల భీమరాజు,చెల్లుబోయిన తాతారావు, కుంపట్ల వరుణ్‌బాబు, జంపన ప్రసాదరావు, కొప్పుల బాబీ, అయితాబత్తుల సుబ్బారావు తదితరులు నిరసనలో పాల్గొన్నారు. రైతుల డిమాండ్లను కేంద్రం ఆమోదించే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆందోళనకు దిగిన రైతులపై పోలీసులు కాల్పులు జరపడాన్ని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. తూటాలకు బలి అవుతున్న రైతులకు, రైతుల పోరాటానికి ఆంధ్రా రైతులు అండగా నిలవాలని జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి పిలుపునిచ్చారు. రైతుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సహాయ కార్యదర్శి కొట్టాల వెంకటరెడ్డి, పుప్పాల రామకృష్ణ, వి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో ఘనంగా స్వామివారి గ్రామోత్సవాలు

ద్రాక్షారామలో భీమేశ్వరుని రథోత్సవం...6లో



గోపాలపురం సిద్ధార్థనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్న మహిళలు

స్వగ్రామంలోనే కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి

దళితుల నిరసన సెగ

- ఒక పక్క దళితుల ఆందోళన..
- మరోపక్క పోలీసు బందోబస్తు నడుమ పాఠశాల ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే దండ వేసిన అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం
- జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటు

రావులపాలెం, ఫిబ్రవరి 23: కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి తన స్వగ్రామంలోనే దళితుల నుంచి నిరసన సెగ తగిలింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు, గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా సిద్ధార్థ నగర్‌వద్ద అవంతి ఫ్యాక్టరీ యజమాన్యం సమకూర్చిన నిధులతో నిర్మించిన ఎంపీపీ పాఠశాలకు జగ్గిరెడ్డి తండ్రి చిర్ల సోమసుందరరెడ్డి పేరు పెట్టడాన్ని ఆ ప్రాంతవాసులు వ్యతిరేకించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటుచేసి దళితులు నిరసన తెలిపారు. ఆ సమయంలో జగ్గిరెడ్డి అక్కడకు వచ్చారు. గతంలో అన్నపూర్ణ హోటల్‌లో అంబేడ్కర్ బొమ్మతో ఉన్న ప్లేట్ల వివాదంలో అమాయకులైన దళితులను జైలుకు పంపి ఇప్పుడు ఇక్కడికి ఎలా వచ్చారంటూ జగ్గిరెడ్డిని మహిళలు నిలదీశారు. ఒకపక్క నిరసనలు కొనసాగుతుండగానే మరోపక్క జగ్గిరెడ్డి అవంతి ఎండీ ఇంద్రకుమార్‌తో కలిసి పోలీసు బందోబస్తు నడుమ పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందుగా అక్కడే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాల వేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన వారిని సమర్థించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అమాయకులైన దళిత యువకులను జైలుకు పంపి ఇప్పుడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడం ఏమిటంటూ మరోమారు వివాదం తలెత్తింది. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కార్యక్రమం అనంతరం జగ్గిరెడ్డి అక్కడి నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించేందుకు గ్రామంలోకి వెళ్లారు. సిద్ధార్థనగర్ యువకులు అంబేడ్కర్‌కు జగ్గిరెడ్డి వేసిన పూలదండలను తీసివేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దళితులను అక్రమ కేసులో ఇరికించి జైలుపాలు



సిద్ధార్థనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళల ఆగ్రహం

చేసినప్పుడు అంబేడ్కర్ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించా రు. ఎంపీపీ పాఠశాలకు సోమసుందరరెడ్డి పేరును వ్యతిరేకిస్తున్నామన్నారు. అంబేడ్కర్ పేరు పెట్టాలని శాంతియుతంగా నిరసన చేపట్టామన్నారు. వివాదం జరిగే అవకాశం ఉందనే సమాచారంతో జగ్గిరెడ్డి నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలను భారీగా సమీకరించారని తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

జగన్ మాదిగలను విస్మరించారు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

రావులపాలెం, ఫిబ్రవరి 23: ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంటానని ఇడుపులపాయ సాక్షిగా మాటిచ్చి ఓట్లు వేసి గెలిపించిన అనంతరం జగన్ మాదిగలను విస్మరించారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. రావులపాలెంలోని కాపు కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజశేఖరరెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. ఆయన మాట ఇస్తే కట్టుబడి ఉండేవారన్నారు. సీఎం జగన్‌కి తండ్రిలోని మంచి లక్షణాల్లో ఒక్కటి కూడా లేవన్నారు. అందుకు వర్గీకరణ అంశమే సాక్ష్యమన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రానికి జగన్ విజ్ఞప్తి చేయలేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉంటానని ఇడుపులపాయలో జగన్ హామీ ఇచ్చారన్నారు. దీంతో మాదిగలు ఓటు వేసి వైసీపీని గెలిపించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణపై ఐదేళ్లలో వైసీపీ తీర్మానం చేయలేదని, అసెంబ్లీలో ఒక్క బిల్లు కూడా ప్రవేశపెట్టలేదని, ఢిల్లీ వెళ్లి పెద్దలను కలిసివచ్చినప్పుడు కూడా వర్గీకరణపై మాట్లాడింది లేదన్నారు. వర్గీకరణ అంశం కోర్టులో నడుస్తున్న సమయంలో వాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లాయర్‌ను కూడా నియమించకపో వడం దారుణమన్నారు. మాదిగలను జగన్ ప్రభుత్వం పక్కనపెట్టిందన్నారు. వర్గీకరణకు అనుగుణంగా ఉండను మీరు ఓటు వేస్తే వేయండి లేకపోతే లేదు అన్న చందంగా జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్సీ కులాల వర్గీకరణపై ఏ పార్టీ అనుకూలంగా ఉందో తెల్సుకుంటామన్నారు. జగన్, చంద్రబాబు, పవన్, బీజేపీలతోపాటు అన్ని ప్రధాన పార్టీల నాయకులను కలిసి వారి వైఖరిని తెలుసుకుంటామన్నారు. ఎస్సీ వర్గీకరణకు నిర్దిష్ట హామీఇచ్చి మేనిఫెస్టోలో పెట్టిన పార్టీకే మద్దతు ఇస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణతో సంబంధంలేదని మౌనం వహిస్తున్న వైసీపీఅయినా మరి ఏపార్టీ అయినా వ్యతిరేకిస్తామని కృష్ణమాదిగ చెప్పారు.

లారీలో రూ.9 లక్షలు విలువైన గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

రాజానగరం, ఫిబ్రవరి 23: ప్రయాణికుల ముసుగులో లారీలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులు మార్గమధ్యలో రాజానగరం పోలీసులకు చిక్కారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెంవద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో లారీలో గంజాయి తరలిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ కె.కాశీవిశ్వనాధ్ పర్యవేక్షణలో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీహార్‌కు చెందిన మహమ్మద్ మహ్ఫూజ్ అలం, కేరళకు చెందిన వడకల్ వలపిన్ రాజేష్‌కుమార్, ఏలూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన తాకాసి శివ అలియాస్ శివాజీ నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి 23.5 కిలోల గంజాయిని ప్రయాణికులు మాదిరిగా లారీ ఎక్కి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో తూర్పుగోనగూడెంవద్ద పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.9 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేసినట్టు చెప్పారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కాశీవిశ్వనాథ్



మాణిక్యాంబ సమేత భీమేశ్వరుడి రథోత్సవం

హరహర ధ్వానాలతో ..

భీమేశ్వరుడి రథోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపుర మండలం ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణ మహోత్సవంలో భాగంగా భీమేశ్వర స్వామివారి రథోత్సవం శుక్రవారం భక్త కోలాహలంతో వైభవంగా జరిగింది. మధ్యాహ్నం కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్లను పుష్పాలంకృతమైన రథంపై అర్చకస్వాములు అధిష్ఠింప చేశారు. దూపసేవ అనంతరం 2.30 గంటలకు ఈవో పీటీవీ సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. స్వామివారి రథం ఆలయంవద్ద నుంచి చంద్రవీధి గుండా వెలంపాలెం చేరుకుని సూర్యవీధి మీదుగా మెయిన్‌రోడ్డు చేరుకుంది. తదుపరి మార్కెట్, యానాం సెంటర్ నుంచి వేగాయమ్మపేట చేరుకుంది. రథంలో ఆశీనులైన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లను పుర వీధులలో భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా ఆస్థాన పూజ

రాత్రి 6.30కు ఆస్థాన మండపంలో కల్యాణమూర్తులకు ఆస్థాన పూజ జరిగింది. వేద స్వస్తి అనంతరం పూజలు నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం కార్యక్రమంతో ఆస్థాన పూజ ముగిసింది. కార్యక్రమంలో వాడ్రేవు సుందరరత్నకరావు, ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, ఆలయ ఆస్థాన పండితులు దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకులు, వేదస్వస్తి వాచక బృందం, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం సీఐ దొర రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేంద్ర పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విజయానంద్ ఆదేశాలతో సిబ్బంది విద్యుత్‌సరఫరా క్రమబద్ధీకరించి విద్యుత్‌కండక్టర్లు, వైర్లు తొలగించారు. రథోత్సవం అనంతరం పునరుద్ధరించే పని చేపట్టారు.

ఆర్మీ మాజీ మేజర్ మృతి

రావులపాలెం, ఫిబ్రవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన ఆర్మీ మాజీ మేజర్ నేకూరి మల్లేశ్వరరావు (84) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన సుదీర్ఘ కాలం మేజర్‌గా పని చేశారు. మల్లేశ్వరరావు మృతదేహాన్ని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సందర్శించి సంతాపం తెలిపారు.



నేకూరి మల్లేశ్వరరావు(ఫైల్)

వేడుకగా నరసన్న గ్రామోత్సవాలు



రాజాధిరాజా వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

- అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు
- స్వామివారి చక్రస్నానానికి భారీ ఏర్పాట్లు



సముద్రం వద్ద చక్ర(జల్లు)స్నానం ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏసీ సత్యనారాయణ, ఎస్ఐ రాము, రాజాబహదూర్

అంతర్వేది, ఫిబ్రవరి 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 4గంటలకు స్వామివారు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి రామరాజు, వెంకటసత్యనారాయణరాజులచే నిర్మితమైన రాజాధిరాజా వాహనంపై గ్రామపురవీధుల్లో ఊరేగారు. అనంతరం సాయంత్రం 6గంటలకు ధూపసేవ, 7గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లివారి కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు భక్తులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో చోర సంవాదం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారంరాత్రి 7.30గం టలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారిని 16మండపాల స్తంభం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు నిర్వహించారు. దారి దోపిడీ దొంగకు, భగవంతుని మధ్య జరిగిన సంభాషణను అర్చకులు తమిళంలో చదివారు. దారి దోపిడీ దొంగగా మారిన పరాకాలుడు అనే మహరాజు మారువేషంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహుడిని కూడా దోచుకుంటాడు. మహా విష్ణువు ఆయనను మంచివాడిగా చేసి ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసిన పరకాలుడు పేరును తిరుమంగల్వార్‌గా మార్చి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తారు. ఈ సంభాషణను సున్నాలు, పన్నాలు పేరుతో వైష్ణవోపేతంగా ఆలయ స్థానాచార్యులు, వేద పండితులు, అర్చకులు పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకట శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాముల సారధ్యంలో నిర్వహించారు.

నేడు స్వామివారికి చక్రస్నానం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉదయం శ్రీ స్వామివారికి చక్రస్నానం జరగనుంది. ఈసందర్భంగా రుద్రరాజు బంగారమ్మ బహూకరించిన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి ఆలయంవద్ద నుంచి సముద్రంవద్దకు బయలుదేరి అనంతరం చక్రవారి అవభ్రుదోత్సవం సముద్ర స్నానం, వసంత మండపం వద్ద ప్రత్యేక పూజలు, అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. ప్రత్యేక బృందాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ, ఎస్ఐలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆలయం వద్ద క్యూలైన్లు, సముద్ర స్నానాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఎటువంటి తొక్కిసలాట జరుగకుండా బారీ కేడ్లు ఏర్పాటు చేశామన్నారు. సముద్రంవద్ద సుమారు వంద మీ టర్ల మేర ప్రత్యేక కర్రలతో బారీకేడ్లు కట్టి స్వామివారి చక్రపెరుమాళ్ స్నానమాచరించే ప్రదేశంవద్ద ఏర్పాట్లు చేశారు. చక్రస్నా నం ఏర్పాట్లను ఏసీ సత్యనారాయణ పరిశీలించారు.

ప్రాచీన సుదర్శన పెరుమాళ్ స్వామి..

రాష్ట్రంలో మరెక్కడా లేనటువంటి ప్రాచీన సుదర్శన పెరుమాళ్ స్వామివారిని మాఘమాసంలో పౌర్ణమిరోజున భక్తు లు శిరస్సుపై ఉంచుకుని సము ద్రస్నానం చేయడం మోక్షప్రదం, ముక్తిదాయకమని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు. స్వామివారి పంచబేరల్లో (ధ్రువ, కౌతుక, ఉత్సవ, స్నపన, బలిబేరం) బలిబేరం ఒకటి, చోడష బాడవులు, చోడష ఆయుధాలతో కూడిన ఈ విగ్రహం చుట్టూ జ్వాలలు వెనుక సుదర్శన యంత్రం కిందన గరుడ వాహనం ఉంటాయని తెలిపారు.



అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం దృశ్యం

నేడు గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం తెల్లవారుజామున 3గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సుప్రభాతసేవ మొదలుకొని శ్రీస్వామివారి తిరువారాధాన, బాలభోగం, వార్షిక అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 8గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మితమైన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది.

రేపు స్వామివారి తెప్పోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగం గా ప్రతి సంవత్సరం భీమవరానికి చెందిన గొట్టిముక్కల భీమరాజు తెప్పోత్సవానికి అయ్యే ఖర్చును విరాళంగా ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సాయంత్రం దేవస్థానం చెరువులో మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణల నడుమ బాణసంచా కాల్పులతో హంస వాహనంపై స్వామివారి తెప్పో త్సవం జరుగుతుంది.



చక్రపెరుమాళ్



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు



రెండు కార్లు ఢీ

- ఆరుగురికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 23: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్టణం నుంచి విజయవాడ వెళుతున్న కారును కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడి వద్దకు వచ్చేసరికి ఎన్‌హెచ్16పై గల జ్యూస్‌ఫ్యాక్టరీ సమీపంలో ఐషర్ వ్యాను ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్ దాటి ఏలేశ్వరం నుంచి గొల్లప్రోలు వెళుతున్న కారుని ఢీకొంది. ప్రమాదంలో గొల్లప్రోలు వస్తున్న కారులో ప్రయాణిస్తున్న మొయిళ్ల శ్రీనివాసరావు, మర్రి కృష్ణలకు, గుడాల లక్ష్మీ, శ్రీనివాసరావు, రాజారావు, శోభనలకు గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

రేపు ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు

- ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రారు దుర్గాప్రసాద్ వెల్లడి

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 : ఈనెల 25వ తేదీన కాకినాడ రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆల్ ఆంధ్రప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రారు, కోపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఏపీజేఏసీ అమరావతి సభ్య సంఘమైన ఆల్ ఆంధ్రప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు తనను ఎన్నికల అధికారిగా నియమించారని తెలిపారు. అందువల్ల సంఘం నియమావళి ప్రకారం షెడ్యూల్ ప్రకటించామన్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 25వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్ ఎదురుగా గల రెవెన్యూ భవన్‌లో ఎన్నికలు జరుగుతాయన్నారు. అందువల్ల సభ్యులందరూ ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు హాజరై సహకరించాలని ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ తెలియజేశారు.

లక్కవరం రేంజ్‌లో

ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి పర్యటన

మోతుగూడెం, ఫిబ్రవరి 23: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో లక్కవరం రేంజ్‌లో శుక్రవారం ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి చిరంజీవిచౌదరి సుడిగాలి పర్యటన చేశారు. బేస్ క్యాంప్ వద్ద గొందిగూడెం బీట్‌లో 1962 టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించి అ చెట్లు ఎంత పెరిగాయో ఫారెస్ట్ సిబ్బందితో కొలతలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని అడవిలో మంటలు చెలరేగి కారుచిచ్చులపై అటవీ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. లక్కవరం సబ్ డివిజన్ కార్యాలయంను సందర్శించి అక్కడ జరుగుతున్న విశ్రాంతి భవనం, రేంజ్ కార్యాలయం పనులను పరిశీలించారు. ఆయన వెంట సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌వో పుష్ప సౌజన్య, లక్కవరం రేంజ్ నానాజీ, బీట్ ఆఫీసర్ వెంకట్ రాందాసు, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.



చెట్టును పరిశీలిస్తున్న ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి చిరంజీవి చౌదరి, కార్చిచ్చుపై సలహాలు, సూచనలు ఇస్తున్న దృశ్యం

రైలులో ప్రయాణికురాలికి అస్వస్థత

- సామర్లకోట రైల్వే అధికారుల సహకారంతో వైద్యం అందజేత

సామర్లకోట, ఫిబ్రవరి 23: సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న సుమారు 57 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రయాణికురాలికి తీవ్ర అస్వస్థత కలగడంతో సామర్లకోట రైల్వే అధికారులకు సహచర ప్రయాణికులు సమాచారం అందివ్వడంతో సామర్లకోట రైల్వే పోలీసుల సహాయంతో సామర్లకోట స్టేషన్‌లోని సదరు ప్రయాణికురాలిని దింపి సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంలో హుటాహుటిన తరలించారు. ఆసుపత్రి వైద్యులు వెంటనే వైద్యం అందివ్వడంతో కోలుకున్నారు శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనలో ప్రయాణికురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందించేందుకు సహకరించిన రైల్వే అధికారులకు, రైల్వే పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



పోలీసుల అదుపులో

ముగ్గురు దోపిడీ దొంగలు

నల్లజర్ల, ఫిబ్రవరి 23: నల్లజర్ల మండలం పోతవరం షుగర్ ఫ్యాక్టరీవద్ద దారి దోడిపీకి పాల్పడ్డ ఐదుగురు వ్యక్తుల్లో ముగ్గురు పోలీసులకు చిక్కారు. బుధవారంరాత్రి భీమవరం పట్టణానికి చెందిన నగల వ్యాపారి బాలు నాతురామ్ కారును సిని ఫక్కీలో రెక్కీ నిర్వహించి పోతవరం షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఐదుగురు వ్యక్తులు ఇన్నోవా కారులో వచ్చి ఇన్‌కామ్‌ట్యాక్స్ అధికారులమని బెదిరించి వారి వద్ద 3.5కిలోల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదుతో పారిపోయారు. దోపిడీకి పాల్పడ్డ ఐదుగురిలో ముగ్గురిని కొవ్వూరు డీఎస్పీ రామారావు తమ సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కొంతమంది బంగారు షాపుల్లో పనిచేసే వారి సమాచారంతో ఈ కుట్రకు పాల్పడినట్లు తెలుస్తోంది. కారు లోపల అనుసంధానంగా నిర్మించిన లాకర్ తాళం యాజమాని బాలువద్ద ఉండగానే చోరీ ఏలా జరిగిందనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. దారి దోపిడీ ముఠాకు సమాచారం, సహకరించిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

భీమేశ్వరుడి అన్నదానట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం అన్నదానట్రస్టుకు శుక్రవారం రామచంద్రపురం మండలం తోటపేటకు చెందిన డా.పోతుల వీరవెంకట సత్యనారాయణ రూ.1,00116 విరాళం అందజేశారు. తోటపేటలో 35 ఏళ్లుగా ప్రైవేటువైద్యుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ సదరు విరాళం ఈవో పి.టి.వి. సత్యనారాయణకు అందజేశారు.



విరాళం అందజేస్తున్న వైద్యుడు సత్యనారాయణ

పోలీస్‌బందోబస్తు నడుమ గడపగడపకు..

రావులపాలెం, ఫిబ్రవరి 23: గోపాలపురంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తన సొంత గ్రామంలో పోలీస్‌బందోబస్తు నడుమ గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక గ్రామంలో పాఠశాల ప్రారంభోత్సవ సమయంలో వివాదం తలెత్తుందన్న సమాచారంతో ముందస్తుగానే పోలీసులు భారీగా మోహరించారు. గ్రామంలో నిర్వహించిన ప్రారంభోత్సవ, శంకుస్థాపన, గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమాలు పోలీసు బందోబస్తు నడుమే కొనసాగించారు.

రైతులపై కాల్పులు దుర్మార్గపు చర్య

రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన





కె.గంగవరం: ధర్నా చేస్తున్న అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు, రామచంద్రపురం: నినాదాలు చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

రామచంద్రపురం, ఫిబ్రవరి 23: రైతులపై కాల్పులు జరపడం దుర్మార్గపు చర్య అని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు డిమాండ్‌చేశారు. స్థానిక మెయిన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీ బోర్డర్‌లో రైతులపై పోలీసుల కాల్పులను ఖండిస్తూ నిరసన చేపట్టారు. మోదీ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని, హామీలు అమలు చేయకపోవడంతో రైతులు రెండో దశ ఆందోళన చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా నాయకులు వి.భీమశంకర్, పీడీఎస్‌యూ నాయకులు యు.గనిరాజు, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా నాయకులు బి.సిద్దూ, రామచంద్రపురం రైతు కూలీ సంఘం నాయ కులు చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ, వీరబోయిన బుజ్జి, మేడిశెట్టి రామకృష్ణ, రెడ్డి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కాల్పులకు నిరసనగా ధర్నా

కె.గంగవరం, ఫిబ్రవరి 23: మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మలిదశ పోరాటం చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు ఆధ్వర్యంలో కె.గంగవరం బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ధర్నా చేశారు. పంజాబ్, హర్యానా సరిహద్దు ప్రాంతం ఖనోరీలో పోలీసుల కాల్పులను ఖండించారు. రైతులపై పోలీసు కాల్పులు సిగ్గు, సిగ్గు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు, ప్రజ వ్యతిరేక విధానాలు నశించాలని నినాదాలు చేశారు. అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలన్నారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బి.సిద్దు, ఏఐకేఎంఎస్ నాయకులు రాజారెడ్డి, జనిపెల్ల వరప్రసాద్, కాశిలెనిన్ బాబు, చిల్లే లక్ష్మి, పాము పుష్ప, మల్లెడి రఘుపతి, పాము బాల, చల్లపూడి సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మడికి మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తా



ఆలమూరు, ఫిబ్రవరి 23: టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మడికి కూరగాయాల మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మడికిలో శుక్రవారం జరిగిన బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో మడికి మార్కెట్ కోసం అనువైన స్థలాన్ని కేటాయించిన విషయాన్ని బండారు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈమార్కెట్ అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రాబోయేరోజుల్లో ఈమార్కెట్ అభివృద్ధి కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 23: రవాణా శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.రఘుబాబు ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని మంత్రి పినిపే విశ్వరూప్ శుక్రవారం ఆవిష్కరించారు. తొలుత ఆయన రవాణా శాఖ అధికారులతో సమీక్షించారు. ఆర్టీవో డి.అశోక్‌ప్రతాప్, డైరీ కమిటీ చైర్మన్ వి.భరత్‌కుమార్, జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కేవీవీ నాగమురళీ, ఉపాధ్యక్షుడు కె.రామమూర్తి, వి.నాగశంకర్, కోశాధికారి పి.దుర్గాప్రసాద్, పీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

సన్మానం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీపాద ఎస్.పద్మావతి ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు, పండితులైన కుంచెపూడి జనార్దనస్వామి, మండలీక ఆదినారాయణలను పట్టు వస్త్రాలతో సత్కరించారు. తెలుగు భాష అభివృద్ధికి వారు చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, భమిడిపాటి కనకాద్రి శాస్త్రి, పేరి లక్ష్మీనరసింహం, శిష్టా శ్రీహరి, పుత్సా కృష్ణకామేశ్వర్, శ్రీగిరి పద్మావతి, దువ్వూరి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

మండపేట, ఫిబ్రవరి 23: త్వరలో జరిగే ఎన్నికలకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని తహసీల్దార్ సురేష్‌బాబు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల వివరాలను ఆయన నేతలకు వివరించారు. నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వివరాలు అందించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు.

బీఎస్పీ పార్లమెంట్ కార్యాలయం ప్రారంభం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: బహుజన సమాజ్ పార్టీ అమలాపురం పార్లమెంటరీ కార్యాలయాన్ని ఎర్ర వంతెన వద్ద జిల్లా శాఖ అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన రాష్ట్ర సీనియర్ నాయకుడు బత్తుల లక్ష్మణరావు ప్రారంభించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ప్రకటించారు. పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి యాళ్ల దొరబాబు, జిల్లా ఇన్‌చార్జి కాశి లక్ష్మీభవానీ, ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు, ప్రధాన కార్యదర్శి బూసి జాన్‌మోషే, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోలా త్రిమూర్తులు, సాకా రాజారావు పాల్గొన్నారు.

అభినందనలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: స్వర్ణకార సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన తాళాబత్తుల చినబాబును ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో సత్కరించారు. గౌరవాధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు, గోకరకొండ హరిబాబు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ మార్కెట్ ఆశీలు పాట

మండపేట, ఫిబ్రవరి 23: మండపేట మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునేందుకు శనివారం ఉదయం వేలం పాట నిర్వహిస్తు న్నట్టు మున్సిపల్ కమిషనర్ బి.రాము తెలిపారు. ఆసక్తి వున్న వారు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు.

రేపు జిప్‌మెర్ ఆసుపత్రి ప్రారంభోత్సవం

వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

యానాం, ఫిబ్రవరి 23: యానాంలో ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం యానాంలో నిర్మించిన జిప్‌మెర్ కన్సల్టింగ్ యూనిట్‌ను ఈనెల25న వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి జిప్‌మెర్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి ప్రారంభ కార్యక్రమంలో పుదుచ్చేరి వ్యవసాయశాఖ మంత్రి తేనేజయకుమార్, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొంటారు. ఈసమీక్షా సమావేశంలో పుదుచ్చేరి నుంచి వచ్చిన అధికారులు, యానాం జిప్‌మెర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ అనందరాజ్, సూపరింటెండెంట్ పార్వతీలు, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగునాధం, శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్‌రాళ్లను తొలగించిన బీజేపీ నాయకులు

అల్లవరం, ఫిబ్రవరి23: రెళ్లగడ్డలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి వేసిన గ్రావెల్ రోలింగ్ చేయకుండా వదలివేయడంతో రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి.దీంతో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా నారాయణమూర్తి, జనార్ధన్‌లు రోడ్డుపై ఉన్న గ్రావెల్‌రాళ్లను తొలగించారు. తూర్పులంక వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణంలో వివాదం తలెత్తగా రోడ్డు పనులు కొంతవరకూ చేసి నిలిపివేయడంతో ఇబ్బందులు తలెత్తాయి.

వైసీపీని గద్దెదించాకే రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారిని పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న బండారు సత్యానందరావు

కొత్తపేట, ఫిబ్రవరి 23: అధికార వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే తరువాయి రాష్ట్ర ప్రజలకు తెలుగుదేశం, జనసేన పార్టీతో సుపరిపాలన అందించవచ్చునని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో భారీగా చేరారు. గ్రామానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్ గొలకోటి జగన్మోహనరావు, పంచాయతీ వార్డు సభ్యుడు గొలకోటి సత్యనారాయణ, సీతారామంతో పాటు 150మంది వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. వారికి కండువా వేసి సత్యానందరావు పార్టీలోకి ఆహ్వానించారు. మోడేకుర్రు గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, పార్టీలో చేరిన వారందరూ పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు చిలువూరి సతీష్‌రాజు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ధర్నాల రామకృష్ణ, పల్లి భీమారావు, జక్కంశెట్టి చంటి, కేతా శ్రీను, యల్లమల్లి జగన్మోహన్, సత్తిరాజు ఉషారాణి, రెడ్డి తాతాజీ, రెడ్డి శ్రీనివాస్, యలమంచిలి వెంకటేశ్వరరావు, బండారు వీరబాబు, సరెళ్ళ రాజబాబు, బూసి భాస్కరరావు, బూసి మరియమ్మ, బండారు బుల్లితాత, చిలకలపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఖాయం



బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, ఫిబ్రవరి 23: టీడీపీ, జనసేన ప్రభుత్వం రావటం ఖాయమని, అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక 19,21 వార్డుల్లో శుక్రవారం జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు గురించి ఆయన వివరించారు. వైసీపీ పాలనలో సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వచ్చేఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆయన పిలుపు నిచ్చారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు.రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభి వృద్ధి చేసిన ఘనత టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబునాయుడుకే దక్కుతుందన్నారు. వార్డులో వేగుళ్ల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, కౌన్సిలర్ చింతలపూడి దుర్గసత్యనారాయణ, మల్లిపూడి గణేశ్వ రరావు, అప్పన్నబాబు, మందపల్లి దొరబాబు, పాలచర్ల శిరీషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు తాగునీరు పంపిణీ

అంతర్వేది, ఫిబ్రవరి 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఓఎన్జీసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 నుంచి 25వ తేదీ వరకు దీప్తి ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా తాగునీరు పంపిణీ చేస్తున్నట్టు అధ్యక్షురాలు ఎంవీ బాపమణి తెలిపారు. ఒక్కో మంచినీటి ట్యాంకరు ద్వారా లక్ష లీటర్లు ఆలయానికి తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ పూజలు

కె.గంగవరం, ఫిబ్రవరి 23: కుందూరు శివారు తాడి గొయ్యి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ పూజలు శుక్రవారం ప్రారంభ మయ్యాయి. ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు దంతపులు పీటలపై కుర్చుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్యంగా జీవించేందుకు యోగా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యంగా జీవించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతందని అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా పేర్కొన్నారు. అమలాపురం పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం గురువు యోగాశ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఏఆర్ డీఎస్పీ విజయసారథితో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఒత్తిడిమయ జీవితం గడిపేపోలీసులు విధిగా యోగాసనాలను వేస్తూ ఆహార నియమాలు పాటిస్తే ఎంతోకాలం సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు.

ఓఎన్జీసీ పరిహారం ప్రభుత్వ ఖాతాలో జమచేయాలి



సీఎం నుంచి ఆమోద పత్రాలను స్వీకరిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం. ఫిబ్రవరి 23: యానాంలో మత్స్యకారులకు ఓఎన్జీసీ చెల్లించాల్సిన పరిహారానికి సంబంధించిన నగదును ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ కోరింది. పుదుచ్చేరి సీఎం రంగసామి సిఫార్సు మేరకు లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై ఆమోదంతో ఫైల్ ఓఎన్జీసీకి చేరిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈమేరకు స్థానిక మీడియా ప్రతినిధులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. వారం రోజులుగా పరిహారం అంశాలపై గవర్నర్‌ను రెండుసార్లు, సీఎంను మూడు సార్లు కలిసి ఈపనిని సాధించామన్నారు. 5,462మంది మత్స్యకారుల్లో 173మినహా (కార్మిక శాఖలో నమోదు అయినవారు) 5,289మందికి పరిహారం నెలకు 11,500 చొప్పున 24నెలల పరిహారం ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని కోరారు. మిగిలిన 173మందికి విచారణ నిర్వహించి రెండో దశలో ఇచ్చేలా నిర్ణయించారు. 24నెలలకు 145.97కోట్ల పరిహారానికి ఇప్పటికే ప్రభుత్వ ఖాతాలో రూ.23.14కోట్లు ఉన్నందున మిగిలిన 122.83కోట్లు ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని ఓఎన్జీసీకి నివేదిక అందించామన్నారు. ఈఆమోద ఉత్తర్వులను ఇప్పటికే ఓఎన్జీసీకి మెయిల్ పంపారు. ఒరిజినల్ ఉత్తర్వులను సీఎం రంగసామి నుంచి మల్లాడి తీసుకుని పుదుచ్చేరి నుంచి యానాం బయలుదేరారు. శనివారం కాకినాడలోని ఓఎన్జీసీ ఈడీ రత్నేష్ కుమార్‌కు అందజేస్తామని మల్లాడి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకుండా పరిహారం అందించేందుకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసు కుంటామన్నారు. యానాంలో సమావేశం నిర్వహించి సీఎం, మత్స్య శాఖ మంత్రి, ఇతర అధికారుల ద్వారా పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు మల్లాడి తెలిపారు.

బీజేపీ ప్రజాపోరు యాత్ర

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు బీజేపీ శుక్రవారం ప్రజాపోరు యాత్రను ప్రారంభించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ముమ్మిడివరం గేటు సెంటరు నుంచి నల్లవంతెన, ఎర్రవంతెన మీదుగా సాగిన యాత్రలో పార్లమెంటు సహ కన్వీనర్ బొంతు శివాజీ, అసెంబ్లీ కన్వీనర్ దూరి రాజేష్, సహ కన్వీనర్ నండూరి శ్రీరామ్, ఆర్టీఐ సెల్ కన్వీనర్ అరిగెల తేజ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోనలో శుక్రవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సీహెచ్ అజయ్‌కుమార్, గ్రంధి నానాజీ అధ్యక్షతన ప్రజాపోరు యాత్ర జరిగింది. ప్రధాని మోదీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొలకోటి వెంకటరెడ్డి, మట్ట సూరిబాబు, పలివెల రాజా, దుర్గారావు, కె.రామూర్తి, నాగరాజు, అల్లూరి సత్యనారాయణరాజు, వై.భైరవమూర్తి, దత్తాత్రేయ, నిమ్మకాయల ఈశ్వరరావు, విజయ్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ

పి.గన్నవరం, ఫిబ్రవరి 23: ముంగండ గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. మొదటిరోజు మొసలిపల్లి గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ శాస్త్రి బ్రహ్మత్వంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, రుత్విక్‌వరణలు, దీక్షాధారణ తదితర పూజలు గ్రామంలోని భక్తులు కర్తలుగా పాల్గొని నిర్వహించారు.

ఏడిదలో అభివృద్ధి పనుల ప్రారంభం

మండపేట, ఫిబ్రవరి 23: ఏడిదలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బూరిగ అశీర్వాదం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, వెల్నెస్‌సెంటరు, బీసీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను, సంకావారికాలనీలో రూ.16.59లక్షలతో చేపట్టిన పనులను తోట ప్రారంభించారు. వైసీపీ నేతలు ఎంపీపీ ఉండమట్ల వాసు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, జడ్పీటీసీ కురుపూడి భవాని, ఎంపీటీసీలు తాతపూడి ఉషా, పట్నాల నాగబాబు, వైసీపీ గ్రామ అధ్యక్షుడు పలివెల సుధాకర్, శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి ఉండమట్ల వీర్రాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సముద్రం వద్ద స్వామివారి జల్లుస్నానం

అంతర్వేది, ఫిబ్రవరి 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం మాఘపౌర్ణమిని పురస్కరించుకుని చక్రస్నానం ఏర్పాట్లను డీఎస్పీ వెంకటరమణ, ఏసీ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. కొవిడ్ తరువాత చక్రస్నానం వద్ద స్వామివారి జల్లుస్నానం రద్దుచేసి మరలా ఈఏడాది ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. ఈచక్రస్నానంలో స్వామివారు చక్రపెరుమాళ్ స్నానానంతరం సముద్రం వద్ద ఏర్పాటుచేసిన అరవపై భక్తులకు క్యూలైన్‌లో ప్రత్యేకంగా జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రాము, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 23: బండారులంకలో వేదాంత కార్పొరేట్ సామాజిక బాధ్యతా నిధులు రూ.38లక్షలతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని మంత్రి పినిపే విశ్వరూప్-జేబీమీనాక్షి దంపతులు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం నాడు-నేడు పథకం కింద బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.45లక్షలతో చేపట్టిన ఆధునికీకరణ వసతులను మంత్రి ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, వైస్ చైర్‌పర్సన్ బడుగు మేరీకుమారి, జడ్పీటీసీపందిరి శ్రీహరి, సర్పంచ్ పెనుమాల సునీత, ఉప సర్పంచ్‌కామిశెట్టి శ్రీను, ఎంపీటీసీలు అంకం హిమభారతి, కామిశెట్టి కుసుమ, గుత్తుల జానకీలక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా హాజరై సేవావజ్ర, సేవా రత్న, సేవామిత్ర పురస్కారాలను అందజేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, కమిషనరు ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో నాగార్జున యాదవ్ పూజలు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23: ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఏపీ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగార్జున యాదవ్ శుక్రవారం సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం నంది మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆయన వెంట ఏపీ ఎడ్యుకేషన్ మౌలిక వసతులు అభివృద్ధి సంస్థ డైరెక్టరు టేకుమూడి సుజాత సత్యనారాయణ, మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ ఉన్నారు.

లక్ష్మణేశ్వర శివాలయానికి రూ.63.75లక్షలు మంజూరు

అల్లవరం, ఫిబ్రవరి 23: తుమ్మలపల్లిపార్వతీ సమేత శ్రీలక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో చేపట్టే పనులకు రూ.63.75లక్షలు మంజూరయ్యాయని ఎంపీ చింతా అనురాధ తెలిపారు. దేవదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణతో మాట్లాడగా నిధులు మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈనిధులతో ఆలయ ముఖద్వారం, మండపం, ధ్వజస్తంభం నిర్మిస్తామన్నారు.

రామేశ్వరం శివాలయం తొలగింపు

ఎన్.రామేశ్వరంలోని పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే అనుమతులు లేకుండా రామేశ్వరం ఆలయాన్ని తొలగించారన్న ఆరోపణలు ఉన్నాయి.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: సుందరం మాస్టర్
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: సిద్ధార్థరాయ్
శేఖర్ స్ర్కీన్-1	: హనుమాన్
శేఖర్ స్ర్కీన్-2	: ముఖ్య గమనిక
రమా	: గుంటూరు కారం
గణపతి	: ఐ హేట్ లవ్
వెంకటపద్మావతిస్ర్కీన్-1	:ఊరుపేరు భైరవకోన
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు

మీడియాపై దాడిని ఖండించిన కాంగ్రెస్ నాయకులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 23: మీడియాపై దాడిని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దివి వెంకన్నబాబు, పీసీసీ సభ్యుడు పెన్మెత్స జగ్గప్పరాజు, నియోజకవర్గ కన్వీనర్ గెడ్డం సురేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, వంటెద్దు బాబి, అయితాబత్తుల ఆనందరావు, కంచుస్తంభం సోనీ, పాలెపు ధర్మారావు, పెమ్మాడి స్వామి, చెల్లూరి బాలకృష్ణ పాల్గొన్నారు.

మీడియాపై దాడులు అప్రజాస్వామికం

కాట్రేనికోన, ఫిబ్రవరి 23: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చెయ్యాలంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. పార్టీమండల అధ్యక్షుడు అయితాబత్తుల పండుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచుస్తంభం సోనీ, మాజీ జడ్పీటీసీ పాలెపు ధర్మారావు, మల్లాడి గోపి, చెల్లూరి బాలకృష్ణ పాల్గొన్నారు.

అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

పి.గన్నవరం, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ విమర్శించారు. పి.గన్నవరంలో శుక్రవారం ఆయన టీడీపీ, జనసేన ముఖ్య నేతలను మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం మాట్లాడారు. కాలనీలో టీడీపీ హయాంలో జరిగిన కమ్యూనిటీహాల్ అభివృద్ధిని చూపిస్తూ.. గత నాలుగున్నరేళ్లుగా ఏవిధమైన అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల అధ్యక్షులు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, నాయకులు కత్తుల శ్రీనివాసరావు, యల్లమిల్లి చిట్టిబాబు, మట్టపర్తి శ్రీనివాసరావు, ఆదిమూలం సూరయ్యకాపు, పప్పుల సాయిబాబు, తాటికాయల వెంకటేష్, కర్రి బాబురావు, కోట రాజేంద్రప్రసాద్, నెరెడిమిల్లి రఘు, యడ్ల ఏసుభాస్కరరావు, తాటికాయల శ్రీనివాసరావు, సిరిజ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట, ఫిబ్రవరి 23: కొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలో 133 కేవీ మరమ్మతుల కోసం 10గ్రామాలకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.

సుభాష్‌కి టికెట్ ఎలా ఇస్తారు?

రామచంద్రపురం, ఫిబ్రవరి 23: కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకించిన వాసంశెట్టి సుభాష్‌కి టీడీపీ టిక్కెట్ ఎలా ఇస్తారని టీడీపీ ఎస్సీ సెల్ రామచంద్రపురం నియోజకవర్గ అధ్యక్షుడు పోతుల మాధవ ఆధ్వర్యంలో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సుభాష్‌కి టికెట్ ఇస్తే ఓడిస్తామని హెచ్చరించారు. టీడీపీ ఎస్సీ సెల్ కాజులూరు మండల అధ్యక్షుడు పలివెల ఇజ్రాయేల్‌రాజు, కాజులూరు మండల మహిళా అధ్యక్షురాలు ఎం.సత్యవతి, గొల్లపాలెం బూత్ ఇన్‌చార్జ్ పలివెల వేణుగోపాలస్వామి, ఐటీడీపీ కాజులూరు మండల సభ్యులు వి.శాంతికుమార్, శలపాక బూత్‌ఇన్‌చార్జ్ పి.సత్తిబాబు, జి.శ్రీనుబాబు, కె.సతీష్‌కుమార్, కొండబాబు, శ్రీకాంత్, దుర్గారావు, రాముడు ఇతర టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసీ సర్కారు జయంతి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 23: ఇంద్రజాలం దినోత్సవం సందర్భంగా మెర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో సీనియర్ పీసీ సర్కారు జయంతి నిర్వహించారు. ఇంద్రజాలికుడు, ఉపాధ్యాయుడు శ్యామ్ జాదూగర్ చిన్నారులకు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కల్పించారు.

రావులమ్మ ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, ఫిబ్రవరి23: కె.పెదపూడి గ్రామదేవత శ్రీరాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో ఏకాహం చేపట్టారు. అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆల యం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 23: విద్యార్థి దశ నుంచి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీధి నాటక కళాజాత బృందం వారు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నం శాంతి, కడలి సత్యనారాయణ, శ్రీను జనకల్యాణ్ సంస్థ మేనేజర్ జి.శ్రీను, ఫీల్డు ఎగ్జికేటర్ గుర్రాల అమల, లింకువర్కు, వర్కర్ స్కిల్ సూపర్‌వైజర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజోలు సీటు గొల్లపల్లికే ఇవ్వాలి

మలికిపురం, ఫిబ్రవరి 23: తెలుగుదేశం పార్టీని ఎంతో ముందుకు తీసుకువెళ్లిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకు రాజోలు సీటు కేటాయించాలని పార్టీ నాయకులు అడబాల సాయిబాబు, యెనుముల నాగు, మంగెన భూదేవి, రాపాక ఆనందకుమార్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని కోరారు. రాజోలులో టీడీపీకి ఎనలేని ఆదరణ ఉందని, టీడీపీ-జనసేన కూటమి రాజోలులో విజయం సాధించడం ఖాయమన్నారు. ఎంతో సీనియర్ అయిన గొల్లపల్లి అభ్యర్థిత్వాన్ని అధిష్టానం పరిశీలించాలని కోరారు.

అక్టోబరు నాటికి బ్రిడ్జి పనులు పూర్తిచేస్తాం

మామిడికుదురు, ఫిబ్రవరి 23: పాశర్లపూడిలోని వైనతేయ నదిపై నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణం అక్టోబరు నెలాఖరుకు పూర్తి చేస్తామని రైల్వే సూపరింటెండెంట్ ఇంజనీర్ రామలింగరాజు పేర్కొన్నారు. రైల్వే వంతెన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. బోడసకుర్రు నుంచి పాశర్లపూడి వరకు పంతొమ్మిది పిల్లర్స్‌తో పాటు రెండు ఎబెట్ పిల్లర్లను నిర్మించినట్టు తెలిపారు. ఈనిర్మాణ పనులు 2018లో ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త సంత్ గాగ్డేబాబా జయంతి

కె.గంగవరం, ఫిబ్రవరి 23: ప్రఖ్యాత సాధువు, సంఘ సంస్కర్త సంచార భిక్షువు కుల నిర్మూలన ఆధ్యాత్మిక చైతన్యం వంటి కార్యక్రమాల్లో ప్రజలను చైతన్య పరచిన సంత్ గాగ్డేబాబా 148వజయంతిని కోటిపల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు యాట్ల నాగేశ్వరరావు, పోతాబత్తుల విజయ్‌కుమార్, కొత్తపల్లి దుర్గా ప్రసాద్, కానీల వీరభద్రరావు, పావులూరి వీర్రాజు, పాలెపు ధర్మారావు, మీసాల సురేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.51,116 విరాళం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 23: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కేవీఎస్ఎస్ చంద్రకాంత్-ప్రత్యూష దంపతులు రూ.51,116 విరాళం సమర్పించారు. దాతలకు చైర్మన్ రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. శుక్రవారం వివిధ సేవల సేవల ద్వారా ఆదాయం రూ.1,26,116 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

సామూహిక కుంకుమార్చనలు

మామిడికుదురు, ఫిబ్రవరి 23: ఈదరాడ గ్రామదేవత పునఃప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు కన్నుల పండుగగా జరిగాయి. సుదర్శనం వెంకటజనార్దనాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి చలిమిడి, పానకాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 300మంది మహిళలు కుంకుమ పూజలు చేశారు. నాలుగు రోజులు జరిగిన అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు చలిమిడి పానకాల చెల్లింపుతో సమాప్తమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నరసింహారావుకు డాక్టరేట్



ముమ్మిడివరం, ఫిబ్రవరి 23: ముమ్మిడివరం రాణేలంక మొల్లికి చెందిన విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు జేవీఎల్ నరసింహారావుకు డాక్టరేట్ లభించింది. హర్యానాలోని ఫరిదాబాద్‌కు చెందిన మ్యాజిక్ అండ్ ఆర్ట్ విశ్వవిద్యాలయం అవార్డును ప్రదానం చేసింది. ఈఅవార్డును ఆర్జేడీ జి.నాగమణి ద్వారా అందుకోనున్నట్టు ఆయన శుక్రవారం తెలిపారు. డీఈవో ఎం.కమలకుమారి, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, జగతా బాబ్జి, జగతా జానకిరామయ్య, జగతా వెంకయ్య, ఎల్లా సభ్యుల అభినందించారు.

జగనన్న సురక్ష శిబిరం

మామిడికుదురు, ఫిబ్రవరి 23: పెదపట్నంలంకలోని గిడుగువారిపేటలో జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరం శుక్రవారం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్యులు మాధురి, అనూష, ఆస్ప్రాలిక్ వైద్యుడు హుస్సేన్‌లు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, కొమ్ముల రాము, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, మామిడిశెట్టి రాధామనోహర్, విప్పర్తి నాగేశ్వరరావు, కొమ్ముల సూరిబాబు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ముమ్మిడివరం, ఫిబ్రవరి 23: ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను ఏపీఈడబ్ల్యుఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్, బృందం శుక్రవారం పరిశీలించారు. పాఠశాలకు ఎన్ని పనులు మంజూరయ్యాయి, ఎంత మేర నిధులు విడుదలయ్యాయి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సర్వశిక్షాభియాన్ ఏపీసీ మధుసూదనరావు, ఎంఈవో బొజ్జా రమణశ్రీ, సెక్టోరియల్ అధికారులు, ఏపీఈడబ్ల్యుఐడీసీ డైరెక్టర్ ఉన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

మండపేట, ఫిబ్రవరి 23: స్థానిక విద్యావికాస్ పాఠశాలలో జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈనెల25న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. థైరాయిడ్, బీపీ, షుగర్ పరీక్షలు రూ.100కే చేస్తారన్నారు.

ఎర్రన్నాయుడు జయంతి

రాయవరం, ఫిబ్రవరి 23: టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కె.యర్రంనాయుడు జయంతి వేడుకలు రాయవరంలో శుక్రవారం నిర్వహించారు. రాయవరంలో ఉన్న ఎర్రన్నాయుడు విగ్రహానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ఉండవల్లి రాంబాబు, బర్లరాజు, రేలంగి గణేష్, పిల్లి గణేష్, చల్లా సత్యనారాయణ, మచ్చా సూర్యారావు, పట్నాల జగదీష్, జుత్తుక శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 23: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. వక్కలంక, ఇరుసుమండ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వాసంశెట్టి పెదబాబుపాల్గొన్నారు.

పాఠశాలల్లో 25శాతం పేదలకు ఉచిత సీట్లు

అంబాజీపేట, ఫిబ్రవరి23: ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. స్థానిక మామ్మాఠీ భవనం వద్ద విద్యాహక్కు చట్టం కరపత్రాలను పంపిణీ చేశారు. అనాధలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీ,మైనార్టీ, ఓసీగ్రామీణ ప్రాంత కుటుంబాలకు ఏడాది రూ.1.20లక్షల ఆదాయం ఉన్న వారికి 6శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. మార్చి 14తేదీలోపు ప్రభుత్వం ఏర్పాటుచేసిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.